క్లుప్తంగా

నేడు బండలాగుడు పోటీలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని అప్పరాజుపల్లెలో వెలసిన ఆంజనేయస్వామి దేవస్థానం నందు శ్రావణ మాస శనివారాన్ని పురష్కరించుకుని బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామి వారికి ధ్వజ స్తంభ, నవగ్రహ, ప్రతిష్ట మహోత్సవం జరుగుతుందన్నారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో గెలుపొందినవారికి 9 రకాల బహుమతులను అందజేస్తామన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీఓ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకటేశులు

లింగాల : మండలంలోని ఇప్పట్ల, పెద్దకుడాల, బోనాల, కామసముద్రం, రామాపురం, ఇంటి ఓబాయపల్లె గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆర్డీఓ వెంకటేశులు పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని బీఎల్ఓలతో ఆయన చర్చించారు. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు వంటి వాటిపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, వీఆర్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

మానవహక్కుల ఏపీ వైస్ చైర్మన్‌గా శివనారాయణ

జమ్మలమడుగు రూరల్ : మానవహక్కుల ఆల్ ఇండియా ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్మన్‌గా మండలంలోని కన్నెలూరు గ్రామానికి చెందిన దంపెట్ల శివనారాయణ యాదవ్‌ను శుక్రవారం విజయవాడలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో నేషనల్ చైర్మన్ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

చెన్నూరు : ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని సన్‌రైజ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే

మండలంలోని కొక్కరాయపల్లిలో శుక్రవారం శూలం సురేంద్ర నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పుల్లారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొప్పర్తి పంచాయతీ పరిధిలోని ఎర్రమాచుపల్లె గ్రామంలో శనివారం జరిగే గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డిలు పాల్గొంటారని మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

పాల్‌టెక్నికల్ చదువుతో బంగారు భవిష్యత్

సింహాద్రిపురం : పాల్‌టెక్నికల్ చదువు బంగారు భవిష్యత్‌కు బాట అని కళాశాల ప్రిన్సిపాల్ తాతాజీ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాల్‌టెక్నికల్ కళాశాలలో ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పాసైన విద్యార్థులు పాల్‌టెక్నికల్ చదవాలని.. ఆసక్తి ఉన్నవారు సివిల్ 15 సీట్లు, ఎలక్ట్రానిక్స్ 17, ఎలక్ట్రికల్స్ 30, మెకానికల్ విభాగాలలో 29 సీట్లు ఉన్నాయని.. ఈ కోర్సులలో చేరాలనుకునేవారు నేరుగా కళాశాలలో సంప్రదించి సీటు రిజర్వ్ చేసుకోవాలని ఆయన కోరారు. అలాగే ఫీజు రూ.4700లు మాత్రమేనని.. ఆసక్తిగల విద్యార్థులు 9010222184 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని ఆయన కోరారు.

నీటిని వృథా చేయకుండా భావితరాలకు అందించండి

పులివెందుల టౌన్ : నీటిని వృథా చేయకుండా భావి తరాలకు అందించాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జలశక్తి అభియాన్ కార్యక్రమంపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించి మాట్లాడారు. నీటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో రిటైర్డు భూగర్భశాస్త్ర విభాగాధిపతి చంద్రశేఖరరెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుధీర, పీఆర్ఓ బాలానారాయణ, జలశక్తి అభియాన్ కో ఆర్డినేటర్ విజయలక్ష్మి, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

సింహాద్రిపురం : మండల పరిధి పైడిపాలెంలో శుక్రవారం నిర్వహించిన నాగులకట్ట విగ్రహ ప్రతిష్టలో రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి దంపతులతోపాటు కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు శివారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



వృద్ధుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ప్రజలను కోరారు. శుక్రవారం మండలంలోని ఉరుటూరు గ్రామంలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు అందని వారెవరైనా ఉంటే తెలపాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటిని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు సంబంధించిన మండలస్థాయి అధికారులు పాల్గొనడం వలన చాలా వరకు ప్రజా సమస్యలను పరిష్కరించడం జరుగుతోందన్నారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా ప్రజలకు తెలపాలన్న సంకల్పంతో ప్రతి 50 కుటుంబాలకు వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. ప్రజల కష్టాలను దృష్టిలో పెట్టుకుని ఇటువంటి మంచి పరిపాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మండలంలోని 15 సచివాలయ పరిధిలోని 22 పంచాయతీల్లో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలకు అపూర్వ స్పందన లభించింది. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, గడ్డంవారిపల్లె సహకార సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి జాఫర్ సాదిక్, ఉపాధి ఏపీఓ వెంకటసుబ్బయ్య, మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు, స్థానిక నాయకులు గంగిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, సురేష్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అన్నిరంగాలకు ప్రాధాన్యతే ముఖ్యమంత్రి లక్ష్యం



నూతన మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఆశీనులైన వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీని అన్నిరంగాలలో ముందుకు తీసుకెళ్లాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన లక్ష్యమని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని అంబకపల్లె రోడ్డులో ఉన్న మున్సిపల్ కార్యాలయంలోని మున్సిపల్ నూతన భవనాలను ఆయన మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో వారితోపాటు మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలు తమ కుర్చీలలో ఆశీనులయ్యారు. వారిని మున్సిపల్ కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లె కిశోర్‌లతోపాటు మరికొంతమంది కౌన్సిలర్లు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అనంతరం నూతన కౌన్సిల్ హాలులో హౌసింగ్‌కు సంబంధించిన విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ప్రకారం అందరినీ ఆహ్వానిస్తాం

పులివెందుల రూరల్ : పట్టణంలోని భాకరాపురం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకృష్ణ ఆలయంలో సెప్టెంబర్ 1న నిర్వహించే విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతున్నారని శ్రీకృష్ణ ఆలయ చైర్మన్ ధరణి రమణ తెలిపారు. శుక్రవారం స్థానిక శ్రీకృష్ణ ఆలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీకృష్ణ ఆలయ విగ్రహ ప్రతిష్ట ప్రారంభోత్సవానికి పార్టీలకతీతంగా, కులమతాలకతీతంగా అందరికీ ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వాన పత్రికలు ఇంటికి వెళ్లి అందజేస్తామన్నారు. టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి చెప్పిన విధంగా ప్రొటోకాల్ పాటించే అందరిని ఆహ్వానించడం జరుగుతుందన్నారు. శ్రీకృష్ణ ఆలయ విగ్రహ ప్రతిష్టలో ఎటువంటి ఆరోపణలు చేయకుండా రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలందరూ పాల్గొని ఆలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో రేపు ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్న ముక, నరాలు, తిమ్మిర్లు, వంటి, ఒళ్లు నొప్పులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ వైద్యులు డాక్టర్ డి.వి.నారాయణరెడ్డి ఆసుపత్రిలో 24 గంటలు అందుబాటులో ఉండి ఎండోస్కోపీ, కోలోనోస్కోపీ, అన్ని జీర్ణకోశ, లివర్, ఫ్యాంక్రియాస్ క్యాన్సర్‌లకు ఆపరేషన్లు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

మొక్క జొన్న కంకులతో అమ్మవారి అలంకరణ



పులివెందుల టౌన్ : శ్రావణ మాస తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని స్థానిక అమ్మవారిశాలలో ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని మొక్క జొన్న కంకులతో అలంకరించి పూజలు నిర్వహించారు.

పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు

సింహాద్రిపురం : మండల పరిధిలోని బిదినంచర్ల గ్రామంలో శుక్రవారం పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సుభిక్షం కోసం ప్రతి ఇంటి వద్ద నుంచి ప్రతి మహిళ 101 బిందెలతో అమ్మవారిని శుద్ధి చేసి ప్రత్యేకంగా అలంకరించి 101 టెంకాయలు కొట్టారు. ఇలా ప్రతి ఏటా గ్రామ సుభిక్షం కోసం పూర్వీకుల నుంచి ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు.

నేడు కొలవలి గ్రామపంచాయతీ ఎన్నిక

ముద్దనూరు : మండలంలోని కొలవలి గ్రామ పంచాయతీ ఉప ఎన్నిక శనివారం నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థులు సర్పంచ్ పోటీలో నిలిచారు. అధికారులు ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తిచేశారు. కొలవలి గ్రామ పంచాయతీ పరిధిలో మొత్తం 1294 మంది ఓటర్లు వున్నారు. ఒంటిగారిపల్లె, కొలవలి గ్రామాల్లో పోలింగ్‌స్టేషన్‌లను ఏర్పాటుచేశారు. ఒంటిగారిపల్లె, సోంపల్లె, కొలవలి, ఆకుతోటపల్లె దళితవాడకు చెందిన ఓటర్లు తమ ఓట్లను శనివారం వినియోగించుకోనున్నారు. 1వ పోలింగ్‌స్టేషన్‌లోని ఒంటిగారిపల్లెలో 1 నుంచి 174 వరకు ఓట్లు, కొలవలి గ్రామంలోని 2వ బూత్‌లో 175 నుంచి 734 వరకు ఓట్లు, అదే గ్రామంలోని 3వ పోలింగ్‌స్టేషన్‌లో 735 నుంచి 1294 సంఖ్య వరకు ఒటర్లు ఓట్లు వేయడానికి ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీరభద్రుడు తెలిపారు. ప్రస్తుతం సర్పంచ్ పదవికి పోటీలో బొలిశెట్టి మారుతి, బొలిశెట్టి సుధామణి, బొలిశెట్టి వెంకటసుబ్బమ్మలు వున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

కొండాపురం : ఉద్యోగ అవకాశాలు కల్పించి గ్రామాలను అభివృద్ధి చేయాలని పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు కోరారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో గండికోట పంప్డ్ స్టోరేజి హైడ్రో ఎలక్ట్రిక్ 1000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్రాజెక్ట్ ఏర్పాటు కోసం తిరుమలాయపల్లె గ్రామ పరిధిలోని హెట్రో విండ్ పవర్ సబ్‌స్టేషన్ సమీపంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్ నూతన పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్ట్ వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 1700 మందికి ఉపాధి అవకాశలు కలుగుతాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అనంతరం దొబ్బుడుపల్లె, రాగికుంట, కొడూరు తిరుమలాయపల్లె గ్రామాల ప్రజలు పాల్గొని వారి అభిప్రాయాలను తెలియజేశారు. సమావేశంలో పాల్గొన్న ప్రజలు ఆయా గ్రామాలను అభివృద్ధితో పాటు, ఉపాధి అవకాశలు కల్పించాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో విద్యుత్ దీపాలు, ఆర్వో ప్లాంట్లు ఉన్నతమైన విద్య, వైద్య సదుపాయాలు కల్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో పర్యావరణ పరీరక్షణ అధికారి అశోక్, ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ శోభన్‌బాబు, జిల్లా నెడ్‌క్యాప్ కో ఆర్డినేటర్ ప్రభాకర్, డెవలప్‌మెంట్ అధికారి యల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


'ఈ..బైక్ బావుంది'



ఎలక్ట్రిక్ బైక్‌ను నడుపుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : వ్యాపారస్తులు వినియోగదారుల నమ్మకాన్ని చూరగొనాలని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణ పరిధిలోని కె.అప్పాయపల్లెలో నూతనంగా ఏర్పాటు చేసిన వార్కాస్ ఎలక్ట్రిక్ బైక్ షోరూంను ఆయన పరిశ్రమలశాఖ రాష్ట్ర సలహాదారుడు రాజోలి వీరారెడ్డి, హార్టికల్చర్ స్టేట్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డితో కలసి ప్రారంభించారు. ఎమ్మెల్యే రాకను పురస్కరించుకుని షోరూం సీఈఓ రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డిలు భారీ ఎత్తున బాణా సంచా పేల్చుతూ స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి బైక్‌లను ప్రారంభించారు. ఆయన షోరూం నుంచి క్రాస్ రోడ్డు వరకు, అక్కడి నుంచి షోరూం వరకు బైక్ నడిపారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ



ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ లక్ష్మీగాయత్రి

వేంపల్లె : స్థానిక ఎస్సీ కాలనీలో వాటర్‌గ్రిడ్ పథకంలో భాగంగా 2.5 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శుక్రవారం ఎంపీపీ ఎస్.లక్ష్మీగాయత్రి పంచాయతీ ఈఓ సుబ్బారెడ్డి, మేఘ ఇంజనీరింగ్ సంస్థ మేనేజర్ సోమేశ్వరరావులతో కలిసి భూమిపూజ చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని.. వాటర్ గ్రిడ్ పథకం కింద ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టి పార్నపల్లె ప్రాజెక్టు నుంచి నీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. తద్వారా వేంపల్లెతోపాటు చుట్టూ గ్రామాలకు మంచి నీరు సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. వీటితో ప్రజలకు మంచినీటి సమస్య తలెత్తకుండా ఉంటుందన్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డిలు వేంపల్లె మండలాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేఘ ఇంజనీరింగ్ సంస్థ జనరల్ మేనేజర్ బాలాజి, వీఆర్ఓ రామచంద్ర, ఎస్సీ సెల్ కన్వీనర్ ఎస్.జయరాములు పాల్గొన్నారు.

నిందితులకు జైలు శిక్ష

కొండాపురం : పొలం వద్ద జరిగిన ఘర్షణలో వ్యక్తిపై దాడికి పాల్పడిన ముగ్గురికి జైలు శిక్ష పడింది. మండలంలోని బురుజుపల్లె గ్రామానికి చెందిన అంకిరెడ్డి కుమార్‌నాథ్‌రెడ్డి, అంకిరెడ్డి రామకృష్ణారెడ్డి, కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం రంగాపురం గ్రామానికి చెందిన నవీన్‌కుమార్‌రెడ్డిలు బురుజుపల్లె గ్రామానికి చెందిన అంకిరెడ్డి ఉమామహేశ్వర్‌రెడ్డిని 2016 జూన్ 4వ తేదిన భూ వివాదంలో గొడవ పడ్డారు. ఈ విషయంగా బాధితుడు ఉమామహేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కృష్ణయ్య కేసు నమోదు చేశారు. ఈ కేసు ప్రొద్దుటూరు న్యాయస్థానంలో శుక్రవారం విచారణకు రాగా నేరం రుజువు కావడంతో ముగ్గురికి జైలు శిక్ష విధించారు. ఏ1నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.30 వేలు జరిమాన, ఏ2, ఏ3 నిందితులకు ఆరు నెలల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమాన విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

రక్త హీనతను నివారించండి



మాట్లాడుతున్న సీడీపీఓ వసంతబాయి

కమలాపురం : గర్భిణులు, బాలింతల్లో ఉన్న రక్తహీనతను నివారించడానికి కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ వసంతబాయి తెలిపారు. ఇటీవల కమలాపురం ఐసీడీఎస్ సీడీపీఓగా బాధ్యతలు చేపట్టిన ఆమె శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సూపర్‌వైజర్లు తమ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను పక్కాగా పర్యవేక్షించాలన్నారు. అలాగే రక్తహీనత ఉన్న గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులను గుర్తించి వారిలో రక్తహీనతను నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ కాబడుతున్న టీహెచ్ఆర్ సక్రమంగా సరఫరా అయ్యేలా చూడాలన్నారు. శాఖాపరమైన యాప్‌లలో వివరాలను నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఏవైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

వరి పంటలో కాలిబాటలు తప్పనిసరి



రైతులకు వివరిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : వరి పంటలో కాలిబాటలు తప్పనిసరిగా తీయాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని టి.చదిపిరాళ్లలో నిర్వహించిన డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో ఆయన రైతులకు వరి పంట సాగు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి అవగాహన కల్పించి మాట్లాడారు. వరి పంటలో కాలి బాటలు తప్పనిసరిగా తీయాలన్నారు. ప్రతి 2 మీటర్లకు 20 సెం.మీ. చొప్పున కాలిబాటలు తీస్తే సుడిదోమ పురుగును నివారించవచ్చన్నారు. వరినాట్లు వేసే సమయంలో నారు కొనలు తుంచి నాటాలన్నారు. తద్వారా కాండం తొలుచు పురుగును గుడ్డు దశలోనే నివారించవచ్చన్నారు. వరి పంట నాటిన రెండు వారాల తర్వాత కార్బో ఫ్యూరాన్ 3జీ లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలను తప్పనిసరిగా వాడాలన్నారు. తద్వారా కాండం తొలుచు పురుగు, ఉల్లికోడు, ఆకుముడత పురుగులను నివారించ వచ్చన్నారు. ఏఓ సరస్వతి మాట్లాడుతూ రైతులు ఎరువుల యాజమాన్యాలను చేపట్టాలని, కాంప్లెక్స్ ఎరువులను పైపాటుగా ఎట్టి పరిస్థితుల్లోను వేయరాదన్నారు. యూరియాను పంటకు మూడు విడతలుగా వేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ దస్తగిరి, వీఏఏలు మమత, వెంకటకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన శుకవారం తనిఖీ చేశారు. ఈ నెల 17వ తేదీన సాక్షిలో ప్రచురితమైన పీహెచ్‌సీలో ఫార్మసిస్టు లేక ఇబ్బందులు అనే కథనంకు స్పందించి ఆయన తనిఖీ చేసి రోగులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ఆసుపత్రి వైద్యాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గతంలోని పాలకులు ఆసుపత్రిని పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. ఆసుపత్రిని 24 గంటలు ఆసుపత్రిగా మార్చి ఇద్దరు వైద్యులు అందుబాటులోకి తెచ్చిన ఘనత మన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. నాడు-నేడు కార్యక్రమం కింద ఆసుపత్రిలో మెరుగైన వసతులతో పాటు మౌలిక సదుపాయలు కల్పించామన్నారు. ఫార్మసిస్టును అందుబాటులో ఉంచేలా జిల్లా వైద్య అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. ఆసుపత్రిలో అన్ని విభాగాలలో సిబ్బంది కొరత లేకుండా చూడాలని వైద్యులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, వార్డు కౌన్సిలర్ మహమ్మద్ ఆలీ, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ ఓబులేసు, వైద్యాధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మానవత సేవలు అమోఘం

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవలు అమోఘమని ఎమ్మెల్యే డాక్టర్ ఎం సుధీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో ప్రపంచ శాంతికై మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన శాంతి ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ రఘురామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆగస్టు నెలలో మానవత ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా శాంతి ర్యాలీలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జేడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, మానవత జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ వెంకటరామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్వీ రమణారెడ్డి, మానవత కో చైర్మన్ మేడా రమేష్, అధ్యక్షుడు జీరెడ్డి మల్లిఖార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని కడప రోడ్డులో ఉన్న ఆర్ఆర్ లే అవుట్‌లో నూతనంగా నిర్మించిన శ్రీకార్యసిద్ధి ఆంజనేయస్వామి, శ్రీగణేశ ఆలయ విగ్రహ ప్రతిష్ట, అలాగే మున్సిపాలిటీ పరిధిలోని పెద్దరంగాపురంలో నూతనంగా నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాల సందర్భంగా ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు, ప్రత్యేక అలంకరణతోపాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వేముల : మండలంలోని వి.కొత్తపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శనివారం నుంచి మూడు రోజులపాటు నూతన విగ్రహ ప్రతిష్ట వేడుకలను నిర్వహిస్తున్నారు. ఆలయంలో శ్రీగంగమ్మ ధ్వజ, శిఖర సహిత శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయస్వాముల నూతన విగ్రహాల ప్రతిష్ట వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించనున్నారు. 19వ తేదీన ఉదయం గణపతిపూజ, స్వస్తివాచకం, పంచగవ్య ప్రాశనం, ఏకాదశ రుద్రాభిషేకం తదితర కార్యక్రమాలు, 20న ప్రాతఃకాలపూజలు, మహాస్నపనం, అవాహిత దేవతా హోమాలు, నవగ్రహ, రుద్ర, లక్ష్మీనారాయణ వాస్తు హోమాలు, మధ్యాహ్నం 2 గంటలనుంచి విగ్రహాల గ్రామోత్సవం, 21వ తేదీన సోమవారం శుభ కర్ణాటక లగ్న పుష్కరాంశంలో యంత్ర ప్రతిష్ట, శ్రీగంగమ్మ శిఖర, ధ్వజ సహిత శ్రీసీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం నిర్వహిస్తున్నారు. విగ్రహ ప్రతిష్ట వేడుకలకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

డీసీసీ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోండి

వల్లూరు : ప్రజలు డీసీసీ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి రాజేంద్రకుమార్ తెలిపారు. గడప గడపకై కడప బ్యాంకు కార్యక్రమంలో భాగంగా వల్లూరు పీఏసీఎస్ పరిధిలో శుక్రవారం ఆయన పర్యటించి వల్లూరులోని రైతులు, బ్యాంకు ఖాతాదారుల గృహాల వద్దకు వెళ్లి బ్యాంకు సేవలను గురించి వివరించారు. రైతులు, చిరు వ్యాపారులు, మహిళలు మరియు గ్రామీణాభివృద్ధే ప్రధాన ధ్యేయంగా డీసీసీ బ్యాంకు పనిచేస్తోందన్నారు. డిపాజిట్లపై రుణ సౌకర్యంతోపాటు నెలవారీ వడ్డీ, త్రైమాసికి వడ్డీ చెల్లింపు సౌకర్యం అందుబాటులో వుందన్నారు. తక్కువ బ్యాలెన్స్‌తో అకౌంట్ ఓపెన్ చేయడంతోపాటుగా డెబిట్ కార్డును ఇస్తామన్నారు. సేవింగ్స్ ఖాతాదారులకు రూ.2 లక్షల వరకు ఇన్సూరెన్స్ సౌకర్యం వుంటుందన్నారు. సేవింగ్స్ ఖాతాలోని బ్యాలెన్స్‌పై 3.75 శాతం వడ్డీ చెల్లిస్తామన్నారు. లాకర్ సౌకర్యంతోపాటు బంగారంపై రున సౌకర్యం వుందన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో ఏజీఎం రాజు, మేనేజర్ శ్రీనివాసులు, సూపర్‌వైజర్ రామాంజులురెడ్డి, పీఏసీఎస్ సీఈఓ రామచంద్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని రకాల రుణాలు అందిస్తాం

కమలాపురం : తమ బ్యాంక్ ద్వారా కేవలం రైతులకు మాత్రమే కాదని, అన్ని వర్గాల ప్రజలకు అన్ని రకాల రుణాలను అందిస్తామని డీసీసీ బ్యాంక్ డీజీఎం వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మండలంలోని చెన్నంపల్లెలో ప్రజలకు బ్యాంక్ అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. డీసీసీ బ్యాంక్ అంటే కేవలం రైతులకు మాత్రమే అనే భావన ఉందన్నారు. తమ బ్యాంక్ ద్వారా అన్ని వర్గాల ప్రజలకు అన్ని రకాల రుణాలు అందిస్తామన్నారు. రైతులకు అవసరమైన దీర్ఘకాలిక రుణాలు, ల్యాండ్ డెవలప్‌మెంట్, గొర్రెలు, బర్రెలు, ట్రాక్టర్, పంటరుణాలు, పంటేతర రుణాలు అందిస్తామన్నారు. అలాగే అన్ని వర్గాల ప్రజలకు తక్కువ వడ్డీతోనే బంగారు రుణాలు అందిస్తామన్నారు. రూ.500తో మాత్రమే ఖాతా తెరవవచ్చన్నారు. లాకర్ సౌకర్యం సైతం తమ బ్యాంక్‌లో ఉందన్నారు. ప్రజలందరూ తమ బ్యాంక్ సేవలను వినియోగించుకోవాలన్నారు. కమలాపురం బ్రాంచ్ మేనేజర్ సుధీర్ కుమార్‌రెడ్డి, సూపర్‌వైజర్ వీరశేఖర, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్నవారిని అభినందిస్తున్న దృశ్యం

వేంపల్లె : రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి అని ఏపీఐఐసీ రాష్ట్ర డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రఓబుళరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానికంగా ఖూన్‌కా రిస్తా ఇన్‌చార్జి ఎస్‌డీ సమీర్ ఆధ్వర్యంలో ఓ బ్యూటీ పార్లర్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మాజీ జెడ్పీటీసీ, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ షబ్బీర్‌వలి, వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి ఆర్.వేణుగోపాల్, ఎంపీపీ లక్ష్మీగాయత్రి, డైరెక్టర్లు సల్మా, మునీర్, మానవత సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి, సహాయ కార్యదర్శి కృష్ణతేజ, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు.

సమసమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న సుబేదార్ అశోక్

కమలాపురం : ఎన్‌సీసీ విద్యార్థులు సమసమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆంధ్ర బెటాలియన్-కడప సుబేదార్ అశోక్ తెలిపారు. శుక్రవారం స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన విద్యార్థులకు ఎన్‌సీసీ-బీ సర్టిఫికెట్లను ఆయన అందజేసి మాట్లాడారు. ఎన్‌సీసీ విద్యార్థులు సమసమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. అలాగే సామాజిక దృక్పథాన్ని అలవరచుకోవాలన్నారు. వైఎస్ ప్రిన్సిపాల్ పల్లాకృష్ణ, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన 30 మంది విద్యార్థుల్లో 28 మందికి ఎన్‌సీసీ-బీ సర్టిఫికెట్లు రావడం హర్షణీయం అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని భాకరాపురం సమీపంలోని శ్రీకృష్ణ ఆలయం వద్ద శుక్రవారం ద్విచక్రవాహనం అదుపుతప్పి ఇద్దరికి గాయాలయ్యాయి. వీరపునాయునిపల్లె మండలానికి చెందిన గ్రామ సర్వేయర్ రాజు, గ్రామ రెవెన్యూ ఆఫీసర్ చంద్రమోహన్‌లు పులివెందుల ఆర్డీఓ కార్యాలయంలో పనులు ముగించుకుని ద్విచక్రవాహనంలో పులివెందుల నుంచి కడపకు వెళుతుండగా శ్రీకృష్ణుని ఆలయం వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో వారికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.